సాక్షి సంగారెడ్డి

గురువారం । 2 । మే । 2024



కనిపిస్తే కబ్జా

ప్రభుత్వ, ప్రైవేట్ భూమి కనిపిస్తే చాలు అక్ర మార్కులు వాలిపోతున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను కబ్జా చేస్తున్నారు.

వివరాలు IIలో ▸



కలెక్టరేట్‌లో క్రెష్ సెంటర్

మెదక్ కలెక్టరేట్‌లో క్రెష్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. అందమైన రంగులు, చిన్నారులను ఆకట్టుకునే బొమ్మలతో సెంటర్‌ను సిద్ధం చేస్తున్నారు.

వివరాలు IIలో ▸



నిర్భయంగా ఓటేయాలి

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలంటూ సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

శభాష్.. మెహ్రీన్ సుల్తానా

విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు



సుల్తానాను అభినందిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: ఇంటర్మీడియెట్‌లో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన రాయల్ జూనియర్ కళాశాల విద్యార్థిని మెహ్రీన్ సుల్తానాను కలెక్టర్ వల్లూరి క్రాంతి అభినందించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థిని, కళాశాల ప్రిన్సిపాల్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఇంటర్మీడియెట్ మొదటి ర్యాంక్ రావడం గర్వకారణం అన్నారు. జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల నిర్వహణలో భాగంగా సిబ్బందికి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. 7, 8వ తేదీలలో నిర్వహించే శిక్షణలో అధికారులంతా పాల్గొనాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆమె ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పైఅధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

'పాలిటెక్నిక్ 'కు 7వరకు గడువు

సంగారెడ్డి టౌన్: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష దరఖాస్తు కోసం 7వ తేదీ వరకు గడువు ఉందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మే 24న ఈ అర్హత పరీక్ష ఉంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఇతరులు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

3రోజుల్లోనే వేతనాలు చెల్లించేందుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి కూలీలకు పనులు చేసిన 3రోజుల్లోపే వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ సత్తయ్య అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం కంగ్టిలోని తన సమావేశ మందిరంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలు ఎక్కువ మంది పనులకు హాజరయ్యే విధంగా చూడాలని, అలాగే గరిష్ట వేతనాలు అందేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పని ప్రదేశంలో సదుపాయాల కల్పన, పోలింగ్ కేంద్రాల పరిశీలన, శానిటేషన్, నర్సరీల్లో మొక్కల పెంపు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీఓ వినోద్‌కుమార్, ఏపీఓ నర్సింహులు, ఎంపీహెచ్ఓ గాలన్న, గణపతి పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ చేసిన అదనపు ఎస్పీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం మోర్గి గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించారు. కొద్దిసేపు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సిద్ధిరాములు ఉన్నారు.


'జాగో తెలంగాణ' బస్సు యాత్ర

నారాయణఖేడ్: ఓటర్ల చైతన్యయాత్రలో భాగంగా 'జాగో తెలంగాణ' పేరిట బస్సు యాత్ర గురువారం మధ్యాహ్నం నారాయణఖేడ్ రానుందని తెలంగాణ ప్రజాస్వామిక వేదిక బాధ్యులు తెలిపారు. బస్సుయాత్రలో భాగంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4వరకు మీడియా సమావేశం, అనంతరం పట్టణ ప్రధాన కూడలిలో ఓటరు చైతన్య సమావేశం నిర్వహించనున్నట్టు వారు చెప్పారు. ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రచార హోరు..

పోటాపోటీగా లోక్‌సభ పోరు

- సమీపిస్తున్న ఎన్నికల సమయం
- నేతలు గ్రామాల బాట
- సభలు సమావేశాలతో బిజీబిజీ
- ప్రచారంలో మాటలు, పాటల జోరు



నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారు కావడంతో జిల్లాలో ప్రధాన పార్టీలు ప్రచారం హోరెత్తిస్తున్నాయి. జహీరాబాద్, మెదక్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పోలింగ్‌కు మరో 13 రోజులే ఉండడంతో ఎలాగైనా ఓటర్లను చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆయా అంశాలపై ప్రచారాస్త్రాలు సంధించేందుకు రెడీ అవుతున్నారు. క్షేత్రస్థాయిలో అభ్యర్థులు పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ప్రత్యర్థిపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతూ.. ఆయా పార్టీలు, అభ్యర్థుల వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారం రక్తికట్టిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు.

జనం కనిపించేలా..

ప్రచార సమయంలో ఎక్కువ సంఖ్యలో జనం కనిపించేలా.. కార్యకర్తల్లో జోష్ నింపేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తరహాలో రోజుకు ప్రచార ఖర్చులను లెక్కలేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేసేలా చూడాలని ద్వితీయ శ్రేణి నాయకులకు సూచిస్తున్నారు. ఎన్నికల ప్రచార తాపంతో ఈ వేసవి మరింత వేడెక్కే పరిస్థితి కనిపిస్తుందని ఓటర్లు పేర్కొంటున్నారు.

జెండాలు, ఫ్లెక్సీలు, వాహనాలకు ఆర్డర్లు

ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ పార్టీల అభ్యర్థులు ఫ్లెక్సీలు, జెండాలు విరివిగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇచ్చిన ఆర్డర్ల ప్రకారం ఎన్నికల సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. వాటిని ఏర్పాటు చేయడానికి కూలీలను సిద్ధం చేసుకుంటున్నారు. అభ్యర్థి ప్రచారానికి ఒక రోజు ముందే ఏర్పాటు చేసేలా ఆయా ప్రాంతాలకు చేరవేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో వాహనాల పాత్ర కీలకం. గ్రామాల్లో పర్యటించడానికి కార్యాచరణ రూపొందించి పార్టీ నాయకుల వాహనాలకు అదనంగా ఇతర వాటిని అద్దెకు తీసుకుంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 వరకు నాయకులతోనే ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రత్యేకంగా తయారు చేసిన ప్రచార రథాల్లో అభ్యర్థికి సంబంధించిన పాటలతో హోరెత్తిస్తున్నారు.

సోషల్ మీడియాతో చేరువయ్యేలా..

మొబైల్ ఫోన్ ప్రతీ ఒక్కరికి చేరువ కావడంతో సోషల్ మీడియాల్లో ఖాతాలు తెరిచి తమ ప్రసంగాలు అందరికీ చేరేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నియోజకవర్గ, మండలాల వారీగా సోషల్ మీడియా కన్వీనర్లను నియమించుకున్నారు. వారికి అవసరమైన సాంకేతిక పరికరాలు, టెక్నాలజీని అందుబాటులో ఉంచుతున్నారు. వారి నాయకుడికి సంబంధించిన ప్రచారం చేయడంతో పాటు ప్రత్యర్థుల బలహీనతలు ఎత్తి చూపేలా కంటెంట్లు రూపొందిస్తున్నారు. ఏదైనా తప్పుగా మాట్లాడితే వాటిని వీడియోలు, మీమ్స్ రూపంలో అందరికీ చేరేలా విరివిగా పోస్టులు పెడుతున్నారు. మొత్తం మీద పట్టణాలు, పల్లెల్లో లోక్‌సభ ఎన్నికలపోరు జోరందుకుంది.



వాకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తా..

కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వాకింగ్ ట్రాక్‌లో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్లు, సీనియర్ సిటిజన్‌లు, యువకులతో కలిసి బుధవారం ఆయన మాట్లాడారు. యువకులతో కలసి కొంతసేపు క్రికెట్ ఆడారు. అనంతరం మాట్లాడుతూ తనను గెలిపిస్తే వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాష్ట్రంలో తమప్రభుత్వమే అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో పాంచ్ గ్యారంటీలను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలింపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తూర్పు శ్రీనివాస్, అన్వర్ పటేల్, అరుణ్‌గౌడ్, కృష్ణ, శేఖర్, రవిచారి తదితరులు ఉన్నారు.

ఓటమి భయంతోనే దిగజారుడు మాటలు

- సురేశ్ షెట్కార్, రాములునాయక్
- బీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు



మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్, రాములునాయక్

నారాయణఖేడ్: బీజేపీకి 200స్థానాలు దాటే పరిస్థితి లేదని తెలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తప్పుడు, దిగజారుడు మాటలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని జహీరాబాదు కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆరోపించారు. నారాయణఖేడ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏ ప్రధాని కూడా మోదీలా రాముడు, కులం, మతం పేరిట ఓట్లు అడగలేదని మండిపడ్డారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగానే ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించగా దాని సిద్ధాంతాలనే బీజేపీ పాటిస్తోందని చెప్పారు. రిజర్వేషన్ల అమలు, ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు, ఉద్యోగ అవకాశాలు, దేశాభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆలోచించి అవగాహన చేసుకోవాలని సూచించారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు సంగారెడ్డి-నాందేడ్ -అకోలా, హైదరాబాదు -జహీరాబాద్, ముంబాయి జాతీయ రహదారుల విస్తరణ, జహీరాబాద్‌లో కేంద్రీయ విద్యాలయం, 15మోడల్ స్కూల్స్, రెండు ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలు, నిమ్జ్‌తోపాటు అనేక పనులు మంజూరు చేయించానని షెట్కార్ గుర్తు చేశారు. పదేళ్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ అభివృద్ధి పనులు చేయకపోగా ప్రజలకు అందుబాటులో లేరని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలని, ఎన్నికల అనంతరం వీఆర్ఎస్ తీసుకోవడం ఖాయమని రాములునాయక్ జోస్యం చెప్పారు. ఏఐసీసీ స్పోక్స్ పర్సన్ డా.గిరిజ షెట్కార్, నాయకులు ప్రకాశ్ రాథోడ్, గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు కలిగించొద్దు

- ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి.తివారి
- కేతకిలో ప్రత్యేక పూజలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తివారి తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు గోపాల్ జి.తివారి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని కుప్పానగర్ లోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలోని గదులు, ర్యాంపులు, ఓటర్ల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియను పరిశీలించి పలుసూచనలు, సలహాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఓటర్ స్లిప్పుల పంపిణీ అనంతరం తప్పనిసరిగా వారి సంతకాలు తీసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీఓ రాజు, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐలు నయీముద్దీన్, రాజు, తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీఓ సుధాకర్, ఎస్ఐ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో ప్రత్యేక పూజలు

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు గోపాల్ జి.తివారి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

పంట నమోదులో అవకతవకలు

- ఏఈఓపై ఫిర్యాదు

కల్హేర్(నారాయణఖేడ్): పంటసాగు వివరాలు నమోదులో అవకతవకలకు పాల్పడిన ఏఈఓపై చర్యలు తీసుకోవాలని సిర్గాపూర్ మండలం అంతర్‌గాంకు చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్లస్టర్ ఏఈఓగా పనిచేస్తున్న శివకుమార్ గత ఫిబ్రవరిలో జొన్నపంట సాగుచేసిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని రైతులు బుధవారం ఆరోపించారు. సాగు వివరాలు నమోదు చేయకపోవడంతో 30 మంది నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 3ఏళ్ల నుంచి ఏఈఓ ఇదే పరిస్థితి అవలంబిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఫిర్యాదుపై ఏడీఏ నూతన్‌కుమార్ ఏఈఓ శివకుమార్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

అందోలు ప్రజల పాలేరును

- గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): ''గెలిచినా.. ఓడినా.., అధికారంలో ఉన్నా.. లేకున్నా నేను ఎప్పటికీ మీ పాలేరునే''అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం అందోలు మండల పరిధిలోని డాకూరు గ్రామంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన మూడు మాసాల్లోనే అందోలులో రూ.55కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.85కోట్లతో జోగిపేట-అ జ్జమర్రి వంతెన, రూ.20కోట్లతో రోడ్లు, రూ.60 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, మున్సిపాలిటీలో రూ.20కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేయించామన్నారు. సింగూరు కాలువ నిర్మాణం చేపట్టింది తామేనని, నిధులు మంజూరు చేయించింది వైఎస్ ప్రభుత్వం అని చెప్పారు. కానీ ఇతర పార్టీ నాయకులు నీళ్లువదిలి పూలుచల్లి పబ్లిసిటీ ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రూ.198కోట్లతో కాలువ లైనింగ్ పనులను చేపడుతున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ మార్కెట్ చైర్మన్, న్యాయవాది జీఆర్ కృష్ణారెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా డాకూరు గ్రామంలో ఆయన చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. ఆయన వెంట త్రిషాదామోదర్, మాజీ ఏఎంసీ చైర్మన్ పద్మనాభరెడ్డి, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ జోగిరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శివరాజ్, అక్సాన్‌పల్లి సొసైటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేశ్ గౌడ్, రాజిరెడ్డి, బాలయ్య తదితరులు ఉన్నారు.

జూన్‌లో 'స్థానిక' సంస్థల ఎన్నికలు

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం జూన్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగనున్నాయని మంత్రి దామోదర తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు జరిగే ఆ ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీనే గెలవాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

అభివృద్ధిని వివరించాలి..

మునిపల్లి(అందోల్): కొత్త, పాత తేడాలేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి దామోదర కార్యకర్తలకు సూచించారు. బుధవారం వివిధ గ్రామాల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మక్తక్యాసారం మాజీ ఎంపీటీసీ శివచంద్రకుమార్ పాటిల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, చిన్నచల్మెడ సర్పంచ్ విజయభాస్కర్ తదితరులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌వలలో ప్రభుత్వ ఉద్యోగి



- టాస్కులు కమీషన్‌ల పేరుతో మోసం
- రూ.17.95లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- మరో ఘటనలో రూ.2లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ ప్రభుత్వ ఉద్యోగి రూ.17.95లక్షలు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్టేషన్ పరిధిలోని ఓ ప్రభుత్వ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ తన టెలిగ్రామ్ యాప్‌కు ఏప్రిల్ 21న మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైబర్ మోసగాళ్లు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్‌చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.వెయ్యి చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తిచేయడం మొదలుపెట్టాడు. తాను పెట్టిన నగదును, వచ్చిన కమీషన్‌ను నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.17.95లక్షల చెల్లించాడు. చివరిగా ఆ ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమిషన్ తనకివ్వాలని పట్టుపట్టగా దుండగులు స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మొదట సైబర్ పోలీసులకు, బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వాట్సాప్‌కు ఏప్రిల్ 23న గూగూల్ రేటింగ్ ఇవ్వాలంటూ వచ్చిన ఓ మెసేజ్‌కు స్పందించాడు. అలా చేసినందుకు సైబర్ నేరగాళ్లు రూ.210 జమచేశారు. ఆ తర్వాత గేమ్‌ఆడి టాస్క్ పూర్తిచేస్తే అదనంగా డబ్బులు ఇస్తానని చెప్పడంతో బాధితుడు నగదు పెడుతూ వచ్చాడు. అలా మొత్తం రూ.2.13లక్షలు మోసపోయాడు. కేసులు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'పబ్లిక్ సెక్టార్'పై పార్టీల నజర్

మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ పబ్లిక్‌సెక్టార్ సంస్థల ఉద్యోగులు, కార్మికుల ఓట్లపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ప్రధానంగా బీహెచ్ఈఎల్(భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్), బీడీఎల్ (భారత్ డైనామిక్స్ లిమిటెడ్), ఓడీఎఫ్ (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ)తో కలిపి సుమారు 15వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సంబంధించి సుమారు 40వేల నుంచి 50వేల వరకు ఓట్లు ఉంటాయి. ప్రధానంగా పటాన్‌చెరు, సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ ఓటర్లు ఉన్నారు.

- బీడీఎల్, బీహెచ్ఈఎల్, ఓడీఎఫ్ ఉద్యోగులపై ఫోకస్
- వారితో టచ్‌లో అభ్యర్థులు
- ప్రత్యేకంగా సభలు, సమావేశాలు
- కీలంగా మారిన కార్మికులు, ఉద్యోగుల ఓట్లు



బీహెచ్ఈఎల్ ముఖద్వారం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కీలంగా ఉన్న ఈ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా సంస్థల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్మిక సంఘాల నేతలతో మాట్లాడి తమకు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. కార్మిక చట్టాలను అమలు చేయడంలో బీఆర్ఎస్ సర్కారు విఫలమైందని కాంగ్రెస్‌తోపాటు బీజేపీ నేతలు విమర్శిస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కార్మికులకు వివరిస్తున్నారు. ఇలా మూడు పార్టీలు ఈ పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల్లోని ఉద్యోగుల ఓట్లను రాబట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. తమను గెలిపిస్తే కార్మికుల అందించనున్న బెనిఫిట్స్, ఇతర సౌకర్యాలపై కరపత్రాలను ముద్రించి ఆయా సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికులకు పంపిణీ చేస్తున్నాయి.

ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం

ఆయా సంస్థల్లో పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, సొసైటీ వర్కర్లు తదితర క్యాటగిరీల్లో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుంటారు. వారితో ఈ సంస్థలపై పరోక్షంగా ఉపాధి పొందుతున్న సంస్థలు, రంగాలకు సంబంధించిన ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఆయా పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులు యూనియన్ల వారీగా సమావేశాలు జరుపుతున్నారు. కార్మిక సంఘాలు కాంగ్రెస్ అనుబంధ యూనియన్ ఐఎన్‌టీయూసీ, బీజేపీ అనుబంధ సంఘం బీఎంఎస్, సీపీఎం అనుబంధ సంఘం సీఐటీయూ, సీపీఎం అనుబంధ యూనియన్ ఏఐటీయూసీ వంటి యూనియన్ల నాయకులతో మమేకమై వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రత్యేక ప్రాధాన్యత..

అభ్యర్థుల గెలుపు ఓటముల్లో ఈ ఓట్ల సంఖ్య కీలకంగా ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ ఓటర్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. సాధారణ ఎన్నికల ప్రచారానికి భిన్నంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టారు. ఆయా కార్మికులు, ఉద్యోగుల కాలనీలకు వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. మార్నింగ్ వాక్‌లో కలిసి వారితో మాట్లాడుతున్నారు. తమను గెలిపిస్తే అండగా ఉంటామని హామీలు గుప్పిస్తున్నారు. అయితే ఈ పబ్లిక్ సెక్టార్ సంస్థల ఉద్యోగులు, కార్మికుల ఎటువైపు మొగ్గు చూపుతారనే అంశంపై రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది.

క్లుప్తంగా

భారీ మెజార్టీతో గెలిపించాలి

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు



మాట్లాడుతున్న మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గాలి అనీల్ కుమార్‌కు మద్దతుగా బుధవారం ఝరాసంగం మండలంలోని వనంపల్లి, బోజానాయక్ తండా, సిద్దాపూర్,చిలేపల్లి, చిలేపల్లి తండా,కక్కరవాడ, నర్సాపూర్, కంబాలపల్లి, కప్పాడ్, కొల్లూర్ తదితర గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నర్సింహ గౌడ్, మాణిక్ ప్రభు పాటిల్, షేక్ ఫరీద్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

మెదక్ మున్సిపాలిటీ: అర చేతిలో అంతర్జాలంతో జాగ్రత్తగా ఉండాలని, ప్రజలందరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సుభాష్ చంద్రబోస్ తెలిపారు. బుధవారం మెదక్ పట్టణ సీఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో మెదక్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రస్తుతం సెల్ ఫోన్ వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు జరుగుతున్నాయని, సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాల గురించి 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

పోక్సో కేసులో నిందితుడు రిమాండ్

సిద్దిపేటకమాన్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూటీవ్ చేసినట్లు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు తెలిపారు. వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన పిట్ల అశోక్ (20) గతంలో పోక్సో కేసులో నిందితుడు. అతడిపై రెండేళ్లుగా నాన్ బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉంది. నిందితుడి కోసం పలు మార్లు గ్రామానికి వెళ్లినా దొరకలేదు. ఆచూకీ సైతం లభ్యం కాలేదు. దీంతో వన్ టౌన్ ఎస్ఐ నర్సింహా రావు తమ సిబ్బందితో కలిసి టెక్నాలజీ సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని బుధవారం కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి విచారణ అనంతరం నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కనిపిస్తే కబ్జా





దొంగ పత్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్

రోజు రోజుకూ పెరిగిపోతున్న ప్లాట్ల మాఫియా

- నకిలీ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్లతో కబ్జా
- పది రోజుల్లోనే రూ.కోట్లు విలువ చేసే భూములు గోల్‌మాల్
- జిల్లా కేంద్రంతోపాటు పట్టణాల్లోనూ..
- రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు

సంగారెడ్డి : ప్రభుత్వ, ప్రైవేట్ భూమి కనిపిస్తే చాలు అక్రమార్కులు వాలిపోతున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను కబ్జా చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు అమీన్‌పూర్, తెల్లాపూర్, జిన్నారం, పటాన్‌చెరు, కంది ప్రాంతాల్లో ఎక్కువగా కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే పాగా వేస్తున్నారు. అమాయకులను ఆసరాగా చేసుకొని వారి ప్లాట్లను కాజేస్తున్నారు.దొంగ పత్రాలే కాకుండా నకిలీ యజమానులను సృష్టిస్తూ ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. తీరా అసలు యజమాని తన ప్లాట్ దగ్గరికి వెళ్లేసరికి కబ్జాదారులు వారిపై దాడికి ప్రయత్నించడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ఎన్నికల అదును చూసుకొని కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను కబ్జా చేస్తూ ప్రభుత్వ సొమ్మును దోచేస్తున్నారు. ఇటీవలె జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని మహబూబ్ సాగర్ చెరువుకు ఆనుకొని ఉన్న రెండు ప్రాంతాల్లో కొందరు కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే గాలి పోచమ్మ గుడి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ల్యాండ్ సర్వే కాలనీలో పార్కు స్థలం కబ్జా చేశారు. రాజంపేట దారిలో నకిలీ పత్రాలు సృష్టించి ప్లాటును రిజిస్ట్రేషన్ చేయించుకొని నిర్మాణాలు చేపట్టారు. దీంతో ప్లాటు యజమాని అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు.

ఒక్కొక్కటిగా వెలుగులోకి..

- అమీన్‌పూర్ గ్రామంలోని మహేశ్‌కు సంబంధించిన 120 గజాల ప్లాట్‌ను అదే కాలనీలో నివాసం ఉంటున్న తిరుపతి రాథోడ్, దేవేందర్ రెడ్డి, రవిగౌడ్, దుర్గా ప్రసాద్, అశోక్, సుబ్బారావులు దొంగా డాక్యుమెంట్‌తో కాజేశారు. ఈ కబ్జాదారులను సంగారెడ్డి పోలీసులు జైలుకు పంపారు.
- పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండలోని 20 ప్లాట్లు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకొని రూ.15 కోట్ల ఆస్తులను కొల్లగొట్టేందుకు కుత్బుల్లాపూర్‌కు చెందిన దుర్గా ప్రసాద్, సుబ్బారావు, అమీన్‌పూర్‌కు చెందిన రవి గౌడ్ చూశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు కబ్జాదారులను అరెస్ట్ చేసి నట్లు జిల్లా ఎస్పీ రూపేశ్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో కబ్జాదారులకు హద్దు లేకుండా పోతుంది. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ స్థలాలు అని తేడా లేకుండా ఎక్కడ కనిపిస్తే అక్కడ పాగా వేస్తూ కబ్జాలు చేస్తున్నారు. ఇకనైనా ప్రస్తుత ప్రభుత్వం జిల్లా మంత్రి చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడి అమాయక ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

> **విచారణ జరుపుతున్నాం**
>
> 
>
> జిల్లా కేంద్రంతోపాటు పలు పట్టణాల్లో కబ్జాలు చేస్తున్నారని ఆరోపణలు రావడమే కాకుండా తమ ప్లాట్లు కబ్జా చేస్తున్నారని సంబంధిత బాధితులు చెబుతున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సమగ్ర విచారణ జరిపి కబ్జాదారులపై, నకిలీలపై చర్యలు తీసుకొని అమాయకులకు న్యాయం చేస్తాం. కొందరు నకిలీ ముఠాగా తయారై నకిలీ ఆధార్, నకిలీ పత్రాలు, వంశస్తులను సృష్టించి ఇప్పటి వరకు 15 నుంచి 20 ప్లాట్లను అమ్మారని, ఈ ప్లాట్ల విలువ సుమారు రూ.15 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. వారిపై కూడా తగు చర్యలు తీసుకుంటాం.
>
> – రూపేశ్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ



క్రెష్ సెంటర్‌లో పిల్లలను ఆకట్టుకునే బొమ్మలు

కలెక్టరేట్‌లో క్రెష్ సెంటర్





మెదక్ కలెక్టరేట్: మెదక్ సమీకృత కలెక్టరేట్ సముదాయంలో క్రెష్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. అందమైన రంగులు, చిన్నారులను ఆకట్టుకునే బొమ్మలు, అక్షరమాల, ఆంగ్ల అక్షరాలు, ఇంద్ర ధనస్సు, చోటా భీమ్ తదితర బొమ్మలతోపాటు చిన్నారుల ఆట వస్తువులతో సెంటర్‌ను సిద్ధం చేస్తున్నారు. చాలా వరకు పనులు పూర్తి కాగా త్వరలోనే ప్రారంభించడానికి సిద్ధంగా చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు :

సమీకృత కలెక్టరేట్‌లోని ఆయా శాఖల్లో విధులు నిర్వహించే మహిళా అధికారుల పిల్లల సంరక్షణ కోసం ఈ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ తెలిపారు. కలెక్టర్ సూచన మేరకు ఆరేళ్లలోపు చిన్నారుల కోసం ఏర్పాటు చేశామన్నారు. మహిళా ఉద్యోగినిలు తప్పనిసరి పరిస్థితుల్లో వారి పిల్లలను వెంటబెట్టుకొని విధులకు హాజరవుతుంటారు. అలాంటి వారి పిల్లలకు ఈ సెంటర్‌లో సంరక్షణ ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు 14 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున, ఎన్నికల అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా సెంటర్ ప్రారంభించనున్నట్లు డీడబ్ల్యూఓ తెలిపారు.

మా ఫోన్లూ ట్యాపింగ్ చేశారు

మల్లన్నసాగర్ నిర్వాసితులు



డీజీపీకి ఫిర్యాదు చేసిన కాపీని చూపిస్తున్న మల్లన్న సాగర్ నిర్వాసితులు

పంజాగుట్ట: మల్లన్నసాగర్ నిర్వాసితుల హక్కుల కోసం పోరాడిన తమ ఫోన్లు కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ట్యాపింగ్ చేయించాడని దీనిపై విచారణ చేయించాలని మల్లన్నసాగర్ నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. 2019లో తాము నిరసన చేస్తున్నప్పుడు తమను కిడ్నాప్ చేసి, చంపేందుకు యత్నించిన పోలీస్ అధికారులు, నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై ఇప్పటికే డీజీపీకి, పశ్చిమ మండల డీసీపీకి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎం.డీ. హయాతుద్దీన్, వై.శ్రీనివాస్‌రెడ్డి, జి.తిరుపతి మాట్లాడుతూ.. కేసీఆర్ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మల్లన్న ప్రాజెక్టు ఎవరు ఆపేందుకు చూస్తున్నారో మేము తెలుసుకున్నామని, మా వద్ద పూర్తి రిపోర్టు ఉందని చెప్పారని పేర్కొన్నారు. అప్పుడు తాము 963 రోజులు దీక్షలు, ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. ఉద్యమిస్తున్న తమ వద్దకు కొంతమంది నాయకులు, అధికారులు, వచ్చి నీవు ఏం చేస్తున్నావో, ఎవర్ని కలుస్తున్నావో పూర్తిగా కేసీఆర్‌కు తెలుసని నీకు ఆఖరు వార్నింగ్ ఇస్తున్నాం, ఉద్యమం నుంచి తప్పుకొమ్మని బెదిరించారని హయాతుద్దీన్ తెలిపారు. తమ ఫోన్లు కూడా ట్యాంపరింగ్ అయ్యాయని దానిపై విచారణ జరిపించాలని కోరారు. ఇదే విషయమై డీజీపీకి, పశ్చిమ మండల డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చందు, కరుణాకర్ రెడ్డి, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడిద్దాం.. కూటమిని గెలిపిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు
- ఘనంగా మేడే వేడుకలు



సంగారెడ్డి టౌన్ : మేడే వేడుకల్లో చుక్క రాములు

సంగారెడ్డి టౌన్ : కార్పొరేట్, మతోన్మాద అనుకూల బీజేపీని ఓడిద్దాం.. ఇండియా కూటమిని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా బుధవారం సంగారెడ్డి సీఐటీయూ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ గార్డెన్‌లో బాగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మేడే సభకు చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పెట్టుబడి వర్గాలకు మేలు చేస్తూ కార్మికుల పొట్టగొడుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని, తమ హక్కుల రక్షణ కోసం పిడికిలి బిగించి అమరులైన పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దామని కోరారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, సహాయ కార్యదర్శి యాదగిరి, వివిధ యూనియన్ల నాయకులు ప్రసన్న రావు, రాందాస్, రమేశ్, దయానంద్, సువర్ణ, శోభ, జరీనా, ప్రవీణ్, బాలరాజు, లక్ష్మీ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటీకరణ విధానాలను తిప్పికొడదాం

పటాన్‌చెరు టౌన్: ప్రజాస్వామ్యానికే ప్రమాదమైన కార్పొరేటీకరణ విధానాలను తిప్పికొడదామని, కార్మిక హక్కులను కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమ వద్ద శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించి, మేడే అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శాండ్విక్ కార్మిక సంఘం నాయకులు పాండురంగా రెడ్డి, ఎమ్.మనోహర్, వీరారావు, హెచ్. వెంకట్రావు, సదాశివరెడ్డి, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

చిరుత పులి దాడిలో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

నారాయణఖేడ్: చిరుత పులి దాడిలో ఆవు మృతి చెందిన ఘటన నిజాంపేట మండలం మాణిక్ నాయక్ తండా శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు కిషన్‌తోపాటు తండా గిరిజనుల కథనం మేరకు.. మాణిక్‌నాయక్ తండాకు చెందిన కిషన్ రోజూలాగే మంగళవారం తన పశువులను తండా శివారులో మేపి సాయంత్రం తన వ్యవసాయ భూమి వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా ఓ ఆవు గాయాలతో మృతి చెంది ఉంది. మరో రెండు పశువులపై చిరుత పంజా విసరడంతో గాయాలైన ఆనవాళ్లు ఉన్నాయి. చిరుతపులి అడుగు గుర్తులు ఆ ప్రాంతంలో కనిపించాయి. తండావాసులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అడుగులు చిరుతవేనని అటవీశాఖ సిబ్బంది నిర్ధారించినట్లు తండావాసులు తెలిపారు. బాధితుడికి పరిహారం అందించడంతోపాటు చిరుతను బంధించాలని తండావాసులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం గుట్ట సమీప హల్దీవాగు చెక్‌డ్యాంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గౌరారం ఎస్సై శివకుమార్ కథనం మేరకు.. చెక్‌డ్యాంలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించాం. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నాం. కుడి చేతికి ఎర్రటి దారం, మినహా మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవు. ఎవరైనా ఇతనిని గుర్తిస్తే గౌరారం పోలీస్ స్టేషన్ నంబర్ 87126 67462, 87126 673403కు ఫోన్ చేయాలని ఎస్సై సూచించారు. మృతదేహాన్ని గజ్వేల్ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

హవేళీఘణాపూర్(మెదక్): చేపల వేట వెళ్లి యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. లింగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన సిద్ధిరాములు(30) మంగళవారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబీకులు గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్దకు చేరుకొని చూడగా కనిపించలేదు. గ్రామస్తులు చెరువులోకి వెళ్లి వెతకగా మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్ఐ రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుడిని చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని జేపీకాలనీ నాగులుగడ్డ సమీపంలో రావన్‌చౌదరి ఉంటున్న ఇంట్లో నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా 600 గ్రాములు ఎండుగంజాయి దొరికింది. అతడిని విచారించగా పలు వివరాలు వెల్లడించాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి వెలిమల గ్రామంలో ఉంటున్న పశ్చిమ బెంగాల్‌కు వాసి మిలాన్ హల్దార్, ఒడిషా వాసి బబూలాల్ హల్దార్, ఇంద్రజిత్ గుప్త నుంచి వస్తుందని చెప్పాడు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో నిందితుడు పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో ఉంటున్న ప్రశాంత్‌ని అదుపులోకి తీసుకోగా 1.3 కిలోల గంజాయి దొరికింది. మొత్తం ఐదుగురి నుంచి 1.9 కిలోల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

జహీరాబాద్ టౌన్: విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలోని అర్జున్ నాయక్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ సీహెచ్. ప్రసాద్ కథనం మేరకు.. అర్జున్ నాయక్ తండాకు చెందిన గణేశ్ నాయక్ కుమారుడు జటోత్ పృథ్వీ నాయక్ (16) పెద్దాపూర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 10 తరగతి చదివాడు. ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాయగా ఫలితాల్లో 8.7 జీపీఏ గ్రేడింగ్ వచ్చింది. కుటుంబ సభ్యుల పిల్లలకు 9 పైగా జీపీఏ రావడంతో మనస్తాపానికి గురయ్యాడు. తక్కువ మార్కులు వచ్చాయని మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో తండ్రి గణేశ్ బంధువుల వద్ద గాలించినా ఆచూకీ దొరకలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

తీర్థయాత్రలకు వెళ్లి..

చేగుంట(తూప్రాన్): తీర్థయాత్ర కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం మేరకు.. కర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన భూమల్ల రామస్వామి, భార్య పెంటమ్మతో కలిసి ఏప్రిల్‌లో ఏపీలోని పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో 23న నెల్లూరు జిల్లా బ్రహ్మంగారి మఠంలో రామస్వామి తప్పిపోయాడు. ఇంటికొచ్చిన పెంటమ్మ కుమారుడు బాబుతో విషయం చెప్పింది. మళ్లీ ఇద్దరూ వెళ్లి రామస్వామి ఆచూకీ వెతికినా ఫలితం కనిపించ లేదు. చేగుంట పోలీసులను ఆశ్రయించగా బ్రహ్మంగారి మఠం పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయాలని సూచించగా అక్కడే ఫిర్యాదు చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

సిద్దిపేటరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్, రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. చింతమడక గ్రామానికి చెందిన కూస రాజయ్య కిరాణా షాపు నడుపుతూ బెల్టు షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారం అందింది. తనిఖీ నిర్వహించగా అతడి వద్ద 9 లీటర్ల మద్యం దొరికింది. అదే విధంగా భైరి తిరుపతిరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 8 లీటర్ల మద్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకొని ఇరువురి విక్రయదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి బుధవారం తెలిపారు.

మోటార్ ప్లగ్ తీస్తుండగా..

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ఝరాసంగం(జహీరాబాద్) : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి పాండు(26) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో పూజా కార్యక్రమాలు ఉండటంతో బుధవారం మధ్యాహ్నం సమయంలో ఎలక్ట్రిక్ మోటార్‌తో ఇంట్లోని బండలను శుభ్రం చేశారు. అనంతరం కరెంటు సరఫరా ఆఫ్ చేయకుండా మోటార్ ప్లగ్ తీస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటినా జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్..

దుబ్బాకటౌన్ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన మైలాగారి మల్లయ్య (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగవారం రాత్రి ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం మల్లయ్య కూతురు రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి మహిళ..

సిద్దిపేటఅర్బన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన వడ్ల వినోద (45) భర్త లక్ష్మీనారాయణ మృతి చెందడంతో మూడేళ్లుగా తల్లి గారి ఊరైన ఎన్సాన్‌పల్లి వద్ద ఉంటోంది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన వినోద గుట్కా, కల్లుకు బానిసగా మారింది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామంలో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామంలోని ఊర చెరువులో మృతదేహం నీటిపై తేలి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బయటికి తీసి చూడగా మృతురాలు వడ్ల వినోదగా గుర్తించారు. మానసిక స్థితి సరిగా లేక ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు మృతురాలి అన్న సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు–బైక్ ఢీ

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

రాయపోలు(దుబ్బాక): కారు–బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన రాయపోలు మండలం కిష్టసాగర్ సమీపంలో చోటు చేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి, స్థానికుల కథనం మేరకు.. మేడ్చెల్–మల్కాజ్‌గిరి జిల్లా రాజబొల్లారం గ్రామానికి చెందిన కోటబాబు శేఖర్ బంధువుల కారులో బుధవారం అత్తగారి ఊరైన రాయపోలుకు వచ్చాడు. భార్యా పిల్లలను తీసుకొని సాయంత్రం స్వగ్రామం బయలుదేరాడు. ఈ క్రమంలో మేడ్చెల్–మల్కాజ్‌గిరి జిల్లా బండ్లగూడకు చెందిన కట్ట ప్రేమ్‌కుమార్ (25), కుంబ దేవ (35) బైక్‌పై ఎదురుగా వస్తూ కిష్టసాగర్ సమీపంలో కారును వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ వెనుకాల కూర్చున్న దేవకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న ప్రేమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బైక్‌పై నుంచి పడి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై ఫేర్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే సత్యభారత్ (35) బిల్డర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లావారుజామున శేరిలింగంపల్లి గోపన్‌పల్లి తండా నుంచి తెల్లాపూర్ వైపు బైక్‌పై వస్తున్నాడు. తెల్లాపూర్‌లోని మై హోం సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముంజల కోసం చెట్టు ఎక్కి..

- కిందపడి రోజువారీ కూలీ మృతి

కొల్చారం(నర్సాపూర్): చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నాయిని జలాల్ పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొప్పుల రాములు(58) రోజువారి కూలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చెట్లపై నుంచి తాటి ముంజలు కోసేందుకు ఉదయం కూలి పనికి వెళ్లాడు. బుధవారం చెట్టు ఎక్కిన రాములు ముంజలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీతో పాటు కుమారుడు ప్రసాద్ ఉన్నాడు. పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ లచ్చయ్య కోరారు.